జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 12-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 336 పేజీలు: 4 వెల : రూ.7

# అలెర్ట్



* జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలు
* రైల్వే, బస్ స్టేషన్లలో కుణ్ణంగా సోదాలు
* అనుమానాస్పద కదలికలపై నిఘా
* జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం















**శ్రీకాకుళం క్రైం, మే11 (వార్త):** శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా రైల్వే, బస్ స్టేషన్లో ముమ్మరంగా ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అలాగే అన్ని రహదారి మార్గాల్లోనూ పోలీసులు ఎక్కడికక్కడ సోదాలు చేశారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమ రవాణా నియంత్రణ, పేలుడు పదార్థాలు గుర్తింపు, సంఘ విద్రోహ శక్తులు అడ్డుకట్టు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అన్ని సబ్ డివిజనల్‌లో డీఎస్పీ స్థాయి పోలీస్ అధికారులు పర్యవేక్షణలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సై, పోలీసు సిబ్బందితో సమన్వయంతో తనిఖీలను నిర్వహించారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, అనుమానస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి ముందస్తు భద్రత చర్యలలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

## అసాంఘిక శక్తుల అణచివేతే లక్ష్యంగా తనిఖీలు

కొత్తూరు: కొత్తూరు మండల కేంద్రంలో అసాంఘిక శక్తుల అణచివేతే లక్ష్యంగా విస్తృత తనిఖీలు చేపట్టినట్లు కొత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ చింతాడ ప్రసాద్ ఆదివారం తెలిపారు. కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు నాలుగు రోడ్ల కూడలిలో స్టేటిక్ స్ట్రేంజర్ చెకింగ్ చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

# ఎర్రన్న విద్యాసంకల్పం పేరిట.. మాక్ డీఎస్సీ

* 300 మంది హాజరు * యువతకు అండగా ఉంటాం
* కేంద్ర మంత్రి రామ్మోహన్

**శ్రీకాకుళం, మే 11(వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రేరణతో అమలవుతున్న ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమం కింద డీఎస్సీ అభ్యర్థుల కోసం ఆదివారం శ్రీకాకుళం, టెక్కలిలో మాక్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మాక్ టెస్ట్‌లు నిర్వహించడం అభ్యర్థులకు ప్రధాన పరీక్షల ముందు విశిష్ట అనుభవాన్ని కలిగించింది. సుమారు 300 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో శివాని కళాశాల, ఐతం కళాశాలలు ముఖ్య భూమిక వహించాయి. శ్రీకాకుళం యువతకు ప్రతిభను నూరిపోసేలా, వారికి ఉద్యోగ, విద్యా అవకాశాలను అందించేందుకు ఎల్లప్పుడూ తోడుంటామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఘనంగా నృసింహ స్వామికి పూజలు



**ఇచ్ఛాపురం, మే 11 (వార్త):** నృసింహ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జగన్నాథ స్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారి ఆవిర్భావ ఘట్టాన్ని మంత్రపూర్వకంగా జరిపి, ఆపై పాలు, పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకం చేశారు. స్వామి వారికి లగ్నాఅష్టకాల పఠనం, తులసి, పుష్పఅర్చన, చందన సమర్పణ, హారతులు, ప్రసాద వితరణ గావించారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలలో సేవాదళ సభ్యులు కె.శ్రీనివాసరావు, వెంకటేష్, పద్మావతి, వెంకటరావు పాల్గొన్నారు.



## విద్యార్థిని జ్యోతికకు సన్మానం

**పలాస, మే 11(వార్త):** పలాస మండలం కేదారిపురం పంచాయతీలో గంగువాడ గ్రామానికి చెందిన వట్టి కూళ్ల ధనుంజయ కుమార్తె వట్టికూళ్ల జ్యోతిక ఇంటర్మీడియట్ ఫలితాలలో 986/1000 మార్కులు సాధించింది. ఆమెను గ్రామస్థులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఒక పల్లెటూరులో జన్మించిన జ్యోతిక మంచి మార్కులు సాధించిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పైల మాధవరావు, అసపాన బాలరాజు, అగ్గున్న కృష్ణారావు, వట్టికూళ్ల రామ్ కుమార్, అసపాన లోకనాథం, అసపాన నారాయణ రావు, పడ్డ సంతోష్, తాడేలా మోహన్‌రావు, పోతురాజు గున్నయ్య, పైల నాగర్జున, పైల నాగరాజు, బాంసుగంటి రామకృష్ణ, పైల విష్ణు, పడ్డ గణపతి, పాడి యోగేశ్వరరావు, వట్టి కూళ్ల కామరాజు, వట్టికూళ్ల సావిత్రి, వట్టి కూళ్ల యోగేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మురళి నాయక్‌కి శ్రద్ధాంజలి



**పలాస, మే 11(వార్త):** ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా యుద్ధభూమిలో దేశరక్షణ కోసం పోరాడి వీర మరణం పొందిన సైనికుడు మురళి నాయక్‌కు ఆదివారం పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో 20వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కార్మిక నాయకుడు అంబటి ఆనందరావు ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. మురళి నాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ సైనికులు ఉప్పాడ వెంకటరవణ జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసమ మనమంతా ముందుండాలన్నారు. వైసీపీ పలాస పట్టణ అధ్యక్షుడు శిస్టు గోపి మాట్లాడుతూ మన దేశంలో ప్రతి ఒక్కరు మురళీనాయక్ మాదిరి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గోర్ల నాగేశ్వరరావు, మాజీ సైనికులు జె.తాతయ్య, బమ్మిడి సుధాకర్, కె.నారాయణ, కె.విశ్వనాధం, హెచ్.అప్పారావు, వంక ఈశ్వరరావు, ఉమ మహేష్, కడప రామకృష్ణ, కోనేరు కాళిదాస్, ఆటో యూనియన్ నాయకులు కొవిరి జగన తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

**పలాస, మే 11(వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్న నిరుపేద దళిత విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉద్యమించాలని వక్తలు కోరారు. శ్రీకాకుళం జిల్లా దళిత సంఘాల సంయుక్త మండలి ఆధ్వర్యంలో పలాసలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న గురుకుల భవనాలు మరమ్మత్తులు చేయించాలని, భవనాలు కొరత ఉన్న చోట నూతన భవనాలు నిర్మాణాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో దళిత విద్యార్థుల విద్య పట్ల గత ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం చేసిందన్నారు. విద్యార్థులకు ఇస్తున్న కాస్మోటిక్స్ ఛార్జీలు ఇవ్వకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు శతశాతం రాకపోవడానికి గల కారణాలను ప్రభుత్వం విశ్లేషించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ఉన్న సమస్యలపై ప్రత్యేక కమిటీతో అధ్యయనం చేయంచాలని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏ రకమైన సమస్యలు లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు మిస్క క్రిష్ణయ్య, బెలమర ప్రభాకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వినోద్, పిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి యాడ్ల గోపి, ధర్మారావు కళంగళం క్రియేషన్ నాయకులు కరుణాకర్, బి.దుర్యోధన, ఎన్జీవోస్ నాయకుల బి.గోపాల్, చల్లా రామారావు, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు గోజ్జ నాగరాజు, ఆదివాసీ సంఘం నాయకులు వరహాల భాగ్యారావు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఇప్పిలి చంద్రశేఖర్, పిలక శ్రీను, ఉదియాపురం శ్రీనివాసరావు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**శ్రీకాకుళం, మే11(వార్త):** దూసిపేట ఉన్నత పాఠశాలలో 1986-91లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. పూర్వవిద్యార్థులంతా ఉన్నత పాఠశాలకు చేరుకుని చదువుకున్న సమయంలో జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అప్పట్లో తమకు బోధించిన ఉపాధ్యాయులు పైడి సత్యన్నారాయణ, రామారావు, బాపినీయం, రమణ మూర్తి, తవిటినాయుడులను పూర్వవిద్యార్థులు దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గుంట లక్ష్మణరావు, బెండి గోవిందరావు, డొంకయ్య, ప్రశాంత్, పొన్నాడ రవి, రాజేంద్రప్రసాద్, లచ్చన్న, లక్ష్మీనారాయణ, పొన్నాడ లక్ష్మి, సరస్వతి, రమణ, రాఘవ, రామకృష్ణ, హరి, సీతారాం, మాలతి, మధు, గోవిందా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**నందిగాం:** తురకలకోట ఉన్నత పాఠశాలలో 1997-98, 1998-99 సంవత్సరాల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు బోధించిన గురువులకు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.





# సీనియర్ జర్నలిస్ట్ శంకర్‌రెడ్డికి సన్మానం



**సంతబొమ్మాళి, మే 11 (వార్త):** ఏపీ ఓల్డ్ ఏజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షునిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సీనియర్ పాత్రికేయులు కర్రి శంకర్ రెడ్డికు సంతబొమ్మాళి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సంతబొమ్మాళిలో ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కర్రి శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఐకమత్యంతో ఉండడం వల్ల జర్నలిస్టుల సంక్షేమాన్ని సాధించవచ్చన్నారు. పాత్రికేయుల రక్షణ కోసం చట్టాలు ఉన్నప్పటికీ వారిపై ఎక్కడికక్కడ దాడులు జరుగుతున్నాయని ప్రభుత్వం వెంటనే తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాత్రికేయులు ఖచ్చితమైన ప్రమాణాలతో వార్తలు రాయడం వల్ల సమాజానికి మేలు చేకూరుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు స్వేచ్ఛ ఉన్న నాడే వారి కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించగలరని తెలిపారు. సన్మానం చేసిన సంతబొమ్మాళి ప్రెస్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దూపాన గౌరీ శంకర్ రెడ్డి, కార్యదర్శి పాండవ సంతోష్, సభ్యులు భీమారావు, జోగారావు, రవి, రింకు తదితరులు పాల్గొన్నారు.

# కంపుకొడుతున్న పలాస కాశీబుగ్గ

*** చెత్తతో నిండిన పలు వార్డులు * కమిషనర్ పర్యటనలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు**

*** ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదని శిష్టు గోపి ఆరోపణ**

**పలాస, మే 11 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్వానంగా మారింది. ఏ వార్డు చూసినా చెత్తతో దర్శనమిస్తోంది. మురుగు కాలువలు పూడుకుపోయాయి. రోడ్డు పక్కన ఉన్న చెత్త నుంచి దుర్గంధం వస్తుండడంతో వార్డువాసులు ముక్కుమూసుకుని వెళుతున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సూదికొండ, రోటరీనగర్, లేబర్ కోలని, శివాజీ నగర్ పరిసరాల్లో మురికి కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం లేదు. మున్సిపల్ కమిషనర్ నిత్యం వార్డుల్లో పర్యటిస్తున్నా ఫలితం ఉండడం లేదు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వైసీపీ పలాస పార్టీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి ఆరోపిస్తున్నారు. పారిశుధ్యం అధ్వాన్నంగా ఉన్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరామన్నారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక





## ఈదుపురంలో మదర్స్ డే వేడుకలు

**ఇచ్ఛాపురం, మే11(వార్త):** ఈదుపురం గ్రామ పంచాయతీలో ఆదివారం మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం హంగీర్ బెహరా ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సైనికుల కోసం జనసేన పూజలు



**అరసవల్లి, మే 11 (వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం హెూమం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యనిర్వహణాధికారి శోభారాణి పర్యవేక్షించారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించామని జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. పూజా కార్యక్రమాల్లో సుడా చైర్మన్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పోటెత్తిన భక్తులు..**

సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. టికెట్లు రూపేనా రూ.8,50,600, పూజలు, విరాళాల రూపంలో రూ.1,63,869, ప్రసాదాల రూపంలో రూ.2,23,580 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో శోభారాణి తెలిపారు.



## వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

**నరసన్నపేట, మే11 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టువస్త్రాలు ధరింపజేసి వివిధ విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు, కళింగవైశ్య పెద్దలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని నరసన్నపేట కళింగవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి జామి వెంకట్రావు తెలిపారు.

## ఎమ్మెల్యే గొండు రక్తదానం

**శ్రీకాకుళం, మే 11 (వార్త):** ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ జన్మదిన సందర్భంగా అరసవల్లి రోడ్డులో ఉన్న ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్ డాక్టర్ కింజరాపు అమ్మనాయుడు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు పాల్గొన్నారు.






## కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షలు

**గార:** వాడాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బిన్నాడ గోపాలరావు ప్రమాదవశాత్తు మరణించాడు. గోపాలరావు పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నందున ఆయన భార్య బిన్నాడ ఆదిలక్షికి రూ.5లక్షలు ఇన్సూరెన్స్‌ను అందజేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆమె అకౌంట్‌నకు డిపాజిట్ చేశారు. బాండ్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్ అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిమ్మ శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో ధర్మాన, తమ్మినేని

**కొత్తూరు, మే11 (వార్త):** మండల పరిధిలోని ఎన్ని రామన్నపేట (మురళీపేట) గ్రామంలో వైస్సార్సీపీ మండల ప్రధాన కార్యదర్శి తిర్లంగి కృష్ణమోహన్ కుమారుడు శ్రీకాంత్ - సరితల వివాహ వేడుకల్లో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, గంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్, జిల్లా కార్యదర్శి బూరెల శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనందరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు సవర సింహాద్రి, బిట్ 3 సర్పంచ్ యెర్లంకి ధర్మారావు, గూనభద్ర సర్పంచ్ ప్రతినిధి వైకుంఠరావు, పారాపురం ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, కూన అర్జున ఉన్నారు.

## 45 మంది యువత రక్తదానం

**శ్రీకాకుళం, మే 11 (వార్త):** ఆన్లైన్ ప్రోడక్ట్ సెల్లింగ్ సంస్థ గ్రాబీజ్ ఫ్యాషన్ (ఓ పి సి) ప్రైవేట్ లిమిటెడ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్ రావు మాట్లాడుతూ ఇటీవల గవర్నర్ ప్రారంభించిన తలసీమియా సెంటర్ ద్వారా బాధిత పిల్లలకు రక్తం అందించడం ఎంతో అవసరమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కదిరి ప్రాంత సైనికుడు మురళినాయక్ ఇటీవల దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, అతని ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. గ్రాబీజ్ సంస్థ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ వి.అప్పలరాజు మాట్లాడుతూ వ్యాపారంతోపాటు సామాజిక బాధ్యతతో కూడా సంస్థ ముందడుగు వేస్తోందన్నారు. తలసీమియా బాధిత పిల్లల ప్రాణాలు నిలబెట్టే లక్ష్యంతో ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, సుజాత, గ్రాబీజ్ సభ్యులు దుర్గా కళ్యాణ్, రామ్ శెట్టి, సురేష్, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం




**మందస, మే 11(వార్త):** విద్యార్థుల్లో పోటీతత్వం అవసరమని మందస శాఖా గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లీషు కూడా అవసరమన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు టి.జయరాంతో విద్యార్థులకు ఇంగ్లీషు భాషపై పట్టు ఎలా సాధించాలి.. మెళుకువలను చెప్పారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసుల ప్రవర్తన హేయం

*** ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్**

**నరసన్నపేట, మే 11 (వార్త):** బీసీ నేత, మాజీ మంత్రి విడదల రజినిపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు దౌర్జన్యంగా ప్రవర్తించడం చాలా దురదృష్టకరమని, ఓ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన రజినిని పోలీసులు పక్కకు నెట్టడం అన్యాయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లా కంతేరులో కూడా ఎంపీటీసీ అయిన దళిత మహిళ కల్పనను వేకువజాము మూడు గంటలకు అరెస్ట్ చేయడం ఏంటన్నారు. ఈ దాష్టీకాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ఈ ఘటనలపై జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టి, ఈ అన్యాయాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

**సారవకోట, మే 11 (వార్త):** ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. వేసవి తాపం అధికంగా ఉండడంతో సారవకోట, బొంతు జంక్షన్ వద్ద చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బి.సి.సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్ అభినందనీయుడన్నారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. బయటకు రావల్సి వస్తే గొడుగును ధరించాలని తెలిపారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బి.సి.సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, సురవరపు తిరుపతిరావు, కోన వెంకటేష్, చిన్నాల సింహాచలం, ఇసా నాగరాజు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక



**శ్రీకాకుళం, మే 11(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చున్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, వాటి యొక్క స్థితి, దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.



## జేసీఐ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ మిర్రర్లు

**ఇచ్ఛాపురం, మే11 (వార్త):** జేసీఐ సంస్థ ఆధ్వర్యంలో ప్రజల రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని మూడు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ మిర్రర్లను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్నమ నాయుడు ఆదివారం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ ప్రజల రోడ్డుపై సురక్షిత ప్రయాణానికి ఈ మిర్రర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈమూడు రోడ్ సేఫ్టీ మిర్రర్లను వెచ్చ రాము స్పాన్సర్ చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు కాళ్ల జైదేవ్, మోహన్, వెంకటేష్, పవన్, తంగుడు షన్ముఖ్, స్వరూప్, మట్ట శ్రీనివాస్, ఢిల్లేశు, రాజ్‌కమల్, మల్లి, సంతోష్, శ్యామ్, శ్రీను సభ్యులు పాల్గొన్నారు.

## వ్యాపారవేత్త కేశవరావుపై దాడి

**ఇచ్ఛాపురం, మే11 (వార్త):** ప్రముఖ వ్యాపార వేత్త వెచ్చా కేశవరావుపై అతని కుమారుడు ప్రముఖ వైద్యులు డాక్టర్ వెచ్చా చలమాజి ఆదివారం రాత్రి దాడి చేసి గాయపరిచినట్లు టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావు చెప్పారు. బంగా రం దుకాణం విషయమై ఇరువురు మధ్య వాగ్వాదం జరగగా కుర్చీతో దాడి చేయడంతో తలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. కేశవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జూదమాడుతున్న నలుగురు అరెస్ట్

**ఇచ్ఛాపురం, మే11 (వార్త):** టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పొందర వీధి పొలాల వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని టౌన్ ఎస్ఐ ముకుంద రావు సిబ్బంది పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి నగదు 1840 రూపాయలు స్వాధీన పరుచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వాతావరణ సమతుల్యతకు మొక్కలు దోహదం



**శ్రీకాకుళం, మే 11(వార్త):** వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని శ్రీకాకుళం జిల్లా పోర్ట్ పోలియో జడ్జి సత్తి సుబ్బారెడ్డి, జిల్లా జడ్జి జునైద్ మహమ్మద్ మౌలానా అన్నారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి భాస్కరరావు, 3వ అదనపు జిల్లా జడ్జి వివేకానంద శ్రీనివాస్, 4వ అదనపు జిల్లా జడ్జి పణి కుమార్, న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తంగి శివప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, స్టేట్ బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు కార్యవర్గ సభ్యులు సీతరాజ్, వనజాక్షి, రమణమూర్తి, సీనియర్ న్యాయవాదులు కొంక్యాన సుభాష్, వి.కృష్ణచంద్, బైరి దామోదరరావు, సత్యనారాయణ, సత్యవాణి, తదితర సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమంలో మాతృ దినోత్సవం

**సోంపేట, మే11 (వార్త):** సోంపేటలోని సీతయ్య ఫౌండేషన్ అనాధా శ్రమంలో ఆదివారం మాతృదినోత్సం ఘనంగా నిర్వహించారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమంలో ఉన్న వారికి దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఆశ్రమం నడుపుతున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేష్, మోహనరావులను ఆశ్రమంలో ఉన్న వారు అభినందనలు తెలిపారు.



* మూడో జాబితాలో దక్కని అవకాశం * నిరాశా నిస్పృహలో కొందరు టీడీపీ నేతలు
* నాలుగో జాబితాలో వస్తుందని జిల్లా నేతల సముదాయింపు




# నామినేటెడ్ పదవుల్లో.. జిల్లాకు మూడో సారీ

**శ్రీకాకుళం, మే 11 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం మరో విడత నామినేటెడ్ పదవులను ఆదివారం భర్తీ చేసింది. ఎస్సీ కమిషన్, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్, ఏపీ ప్రెస్ అకాడమీ, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, ఏపీ ఎన్ఆర్‌టీ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సహకార సంస్థ సహా మొత్తం 22 కార్పొరేషన్లు, కమిషన్‌లకు ఛైర్మన్‌లను నియమించింది. టీడీపీ నుంచి 16 మందికి, జనసేన నుంచి ముగ్గురికి, బీజేపీ నుంచి ఒకరికి, అమరావతి ఐకాస నుంచి ఇద్దరికి అవకాశం కల్పించింది. అయితే ఈసారి శ్రీకాకుళం జిల్లాకు మాత్రం మొండిచేయి చూపింది. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఎనలేని సేవలు అందించిన వారు ఈసారి చాలామంది నామినేటెడ్ పదవులు వస్తాయని భావించారు. వారికి పదవులు రాకపోవడంతో కొంత నిరాశకు గురయ్యారు. గతంలో రెండుసార్లు విడుదల చేసిన జాబితాలో శ్రీకాకుళం జిల్లాకు ప్రాధాన్యమిచ్చారు. ఈసారి మాత్రం ఒక్క శ్రీకాకుళం జిల్లాకే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు అవకాశం రాలేదు. నామినేటెడ్ పదవుల కోసం ఆశించి భంగపడిన వారికి వచ్చే జాబితాలో పేరు ఉంటుందని, ఆందోళన చెందనవసరం లేదని జిల్లాకు చెందిన టీడీపీ నేతలు సముదాయించారు.

# పల్లెల్లో.. బెల్ట్ దందా!

* పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు
* నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు * మామూళ్ల మత్తులో కొందరు ఎక్సైజ్ అధికారులు



**సరుబుజ్జిలి, మే 11 (వార్త):** పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు, మారుమూల గ్రామాలు మత్తులో జోగుతున్నాయి. గ్రామాలు, తండాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనేక మంది బెల్ట్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధిపాలవుతున్నాయి. పల్లెల్లో బహిరంగంగానే బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. అనుమతులు పొందిన వైన్స్ షాపుల నుంచే వందల సంఖ్యలో మద్యం బాటిళ్లు బెల్ట్ దుకాణాలకు తరలుతున్నట్లు నిఘావర్గాలు పేర్కొంటున్నాయి. సంబంధిత ఎక్సైజ్‌శాఖ అనుసంధానాల్లోనూ బెల్ట్ దుకాణాల నిర్వహణకు ప్రోత్సాహం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాలు, తండాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతూ ప్రజలు మత్తులో చిత్తవుతున్నా.. నిరోధించాల్సిన సంబంధితశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఒక వైపు గుడుంబా మానేసిన వారికి ప్రభుత్వం స్వయంఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే మరోవైపు బెల్ట్‌షాపులు పల్లెప్రజలను మత్తులో ముంచెత్తుతున్నాయి. కానీ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు వరకు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. చిన్న గ్రామాల్లో 2 నుంచి 4 దుకాణాలు, పెద్దగ్రామాల్లో 4 నుంచి 10 వరకు బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. ఈ షాపులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. బెల్ట్‌షాపుల్లో మద్యం బాటిళ్లను ఎమ్మార్పీ కంటే రూ.50 నుంచి రూ. 30వరకు అధికంగా విక్రయిస్తున్నారు. మండల కేంద్రాలు, ముఖ్య గ్రామాల్లో మాత్రమే మద్యం షాపులు ఏర్పాటు చేశారు. మద్యం కొనుగోలు చేయాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న గ్రామాల్లోనే బెల్ట్ షాపులు అందుబాటులో ఉండటంతో ఎక్కువ ధర అయినా అక్కడే కొనుగోలు చేసి మద్యం ప్రియుల జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

### పేరుకే కిరాణ.. అమ్మేది మద్యమే..!

అనేకమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజుల్లో పెట్టుకొని మరీ విక్రయిస్తున్నారు. వైన్‌షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోల ద్వారా పంపించి అమ్ముతున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతోంది.

### గ్రామాల్లోనూ వేలం

మరోవైపు గ్రామాల్లోనూ బెల్ట్‌షాపుల నిర్వహణకు వేలం వేస్తున్నారు. గ్రామపెద్దలంతా కలిసి గ్రామ అభివృద్ధి కోసం కొంత సొమ్ము వాడుతున్నారు. నుంచి రెండేళ్లనెల గ్రామంలో మద్యం విక్రయాలు నిర్వహించుకునేందుకు వైన్స్ యజమానులు అనధికారికంగా తీర్మానించారు. ఇలా అనేక గ్రామాల్లో ఈ తంతు కొనసాగుతోంది.



### అధికారుల కనుసన్నల్లోనే..

సరుబుజ్జిల మండలం మద్యం అమ్మకాలు లక్ష రూపాయల్లో మద్యం విక్రయాలు జరుగుతుంది. వైన్స్ యజమానులు, ఎక్సైజ్ పోలీసు అధికారుల అండదండలతో మండలం వ్యాప్తంగా గ్రామగ్రామాన బెల్ట్‌షాపులు ఏర్పాటవుతున్నాయి. మద్యం అధికంగా విక్రయించడానికి ప్రభుత్వం ఎక్సైజ్ అధికారుల ద్వారా మద్యం వ్యాపారులపై ఒత్తిడి తీసుకు రావడంతో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలకు ఊరూరా బెల్ట్‌షాపులు పెట్టి అనధికారికంగా అమ్ముతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546